

# అర్జున్ సన్నాఫ్ వైజయంతి

కల్యాణ్‌రామ్ నటిస్తున్న తాజా చిత్రానికి 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో విజయశాంతి ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. మండుతున్న జ్వాలల మధ్య నడిచి వస్తున్న కల్యాణ్‌రామ్, విజయశాంతి పాత్రలు కథలోని ఇంటెన్సిటీని ప్రజెంట్ చేసేలా ఉన్నాయి. 'యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తయింది. త్వరలో రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. సోహైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.



# సినిమా చూడమని బతిమిలాడుతున్నా!

'దయచేసి సినిమా చూడండి అంటూ ఎప్పుడూ బతిమాడలేదు. కానీ ఈ సినిమా కోసం అడుగుతున్నా. ఎవరూ ఈ సినిమాను మిస్ కావొద్దు. ఫ్యామిలీతో కలిసి వెళ్లండి. గొప్ప సినిమా చూశామనే అనుభూతికి లోనవుతారు' అన్నారు హీరో నాని. ఆయన సమర్పణలో రూపొందిన చిత్రం 'కోర్ట్- స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ జగదీష్ దర్శకుడు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. ఈ నెల 14న విడుదలకానుంది. శుక్రవారం ప్రీరిలీజ్, ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. నాని మాట్లాడుతూ.. ఒకవేళ ఈ సినిమా అంచనాలను అందుకోనట్లు కనిపిస్తే.. రెండు నెలల్లో రిలీజ్ కాబోతున్న తన 'హిట్-3' సినిమాను ఎవరూ చూడొద్దని, గొప్ప కోర్ట్‌రూమ్ డ్రామాగా సినిమా ఆకట్టుకుంటుందని చెప్పారు. మనందరి జీవితాలకు దర్పణంలా ఈ సినిమా ఉంటుందని, అద్భుతమైన టీమ్‌తో తెరకెక్కించడం ఆనందంగా ఉందని దర్శకుడు రామ్ జగదీష్ తెలిపారు. దర్శకుడు స్క్రీన్‌మీద ఓ పొయెట్రీ క్రియేట్ చేశాడని, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్‌తో ప్రాణం పోశాడని నిర్మాత దీప్తి గంటా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, శైలేష్ కొలను, దేవకట్టా, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు.



# మహిషాసుర మర్ధని నేపథ్యంతో..

'బిగ్‌బాస్'ఫేం అర్చన, మితాలి చౌహాన్, వినోద్ అల్వా, కాలకేయ ప్రభాకర్, బలగం సంజయ్, నాగమహేశ్, దిల్ రమేశ్, చిత్రం శ్రీను ముఖ్య పాత్రలు పోషిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. రాకీ షెర్మన్ దర్శకుడు. శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం నిర్మాత. త్వరలోనే పాన్‌ఇండియా రేంజ్‌లో సినిమా విడుదల కానుంది. ప్రమోషన్లో భాగంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని హైదరాబాద్‌లో హీరో పూరీ ఆకాష్ చేతుల మీదుగా విడుదలచేశారు. ఈ సందర్భంగా పూరీ ఆకాష్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. 'మనం చేసుకునే పండుగల వెనుక ఓ హిస్టరీనో, ఓ యుద్ధమో ఉండితీరుతుంది. అలాంటి ఓ యుద్ధం గురించి ఈ సినిమాలో చెప్పాను. ఆ యుద్ధమే మహిషాసుర మర్ధని. ఈ కథను నేను ఎంత పవిత్రంగా నమ్మానో అంతే పవిత్రంగా ఈ సినిమా తీశాను.' అని దర్శకుడు రాకీ షెర్మన్ అన్నారు. సనాతన ధర్మం గురించి చెప్పే సినిమా ఇదని, రాకీ అద్భుతంగా తీశాడని నిర్మాత తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.





# జటాధరలో సోనాక్షి సిన్హా

తెలుగు సినిమా పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటుతున్నది. దీంతో ఇతర భాషల్లోని అగ్ర తారలు సైతం తెలుగు చిత్రాల్లో నటించడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. దీపికా పడుకోన్, అనన్యపాండే, జాన్వీకపూర్ వంటి తారలు ఇప్పటికే తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఇప్పుడీ వరుసలో సోనాక్షి సిన్హా చేరింది. సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'జటాధర' చిత్రంతో ఆమె తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. సుధీర్‌బాబు హీరోగా వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతున్నది. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా సోనాక్షి సిన్హా లుక్‌ను విడుదల చేశారు. యాక్షన్, ఆధ్యాత్మిక, అతీంద్రియ అంశాల కలబోతగా ఓ సరికొత్త ప్రపంచం నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, విజువల్ ఎఫెక్ట్స్ అబ్బురపరుస్తాయని, ఈ నెల 10 నుంచి సోనాక్షి సిన్హా షూటింగ్‌లో జాయిన్ అవుతారని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ పతాకంపై ఉమేష్ కెఆర్ బన్సాల్, ప్రేరణ అరోరా, అరుణ అగర్వాల్, శివిన్ నారంగ్ నిర్మిస్తున్నారు.

# న్యాయం దొరకని బాధితుల పక్షం



'మల్లేశం' '8ఏమ్ మెట్రో' చిత్రాలతో రియలిస్టిక్ ఫిల్మ్ మేకర్‌గా ప్రశంసలందుకున్నారు దర్శకుడు రాజ్ ఆర్. ఆయన రూపొందించిన తాజా చిత్రం '23'. తేజ, తన్మయి ప్రధాన పాత్రల్లో నటించారు. శనివారం టీజర్‌ను విడుదల చేశారు. 1991 చుండూరు ఊచకోత, 1993 చిలకలూరిపేట బస్సు దహనం, 1997 జాబ్లీహిల్స్ కారు బాంబు పేలుడు ఘటనల నేపథ్యంలో టీజర్ ఉత్కంఠగా సాగింది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ ఆర్ మాట్లాడుతూ 'టీజర్‌లో చూపించిన మూడు మారణహోమాల్లో మొత్తం 23 మంది చనిపోయారు. అందుకే అదే టైటిల్ పెట్టాం. మానవ హక్కుల నేపథ్యంలో నడిచే కథ ఇది. న్యాయం దొరకని బాధితుల పక్షం వహిస్తుంది. మూడు ఘటనల్లో చాలా మంది చనిపోయారు. చంపిన వారందరికి సమానంగా శిక్ష పడిందా? అన్నదే అసలు ప్రశ్న. నేను ఎంతగానో కనెక్ట్ అయిన ఈ కథను ప్రేక్షకులకు చెప్పాలనుకున్నా' అన్నారు. నిజజీవిత ఘటనల్ని నిజాయితీగా చూపించారని, చరిత్రలో నిలిచిపోయే సినిమా ఇదని నటి ఝాన్సీ పేర్కొన్నారు. ఈ సినిమాను రానా స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూట్ చేస్తున్నది. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె రాబిన్, సంభాషణలు: ఇండస్ మార్టిన్, దర్శకత్వం: రాజ్ ఆర్.

# వినూత్న కాన్సెప్ట్‌తో 'ల్యాంప్'



వినోద్, మధుప్రియ, కోటి కిరణ్, అవంతిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ల్యాంప్'. రాజశేఖర్ రాజ్ దర్శకుడు. ఈ నెల 14న విడుదలకానుంది. శుక్రవారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు సీనియర్ నటుడు మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని, అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయని దర్శకుడు తెలిపారు. కొత్త కంటెంట్‌ను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందని నిర్మాత జీవీఎన్ శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కథలో ఇంట్రెస్టింగ్ పాయింట్‌ను చర్చించామని హీరో వినోద్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీవెంకట్, రచన-దర్శకత్వం: రాజశేఖర్ రాజ్.



# బ్లాక్‌బస్టర్ టీమ్‌తో మెగా మూవీ?

మెగాస్టార్ సినిమా పనుల్లో బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ వైజాగ్‌లో జరుగుతున్నది. ఈ సినిమా షూటింగ్‌ను ఓ సాంగ్‌తో మొదలుపెట్టనున్నారట అనిల్. మే నెలలో ఈ సాంగ్ షూటింగ్ ఉంటుందని తెలుస్తున్నది. టాకీ పార్ట్‌ని జూన్ నుంచి మొదలుపెడతారట. ఇదిలావుంటే.. ఈ సినిమాకు పనిచేసే టెక్నీషియన్స్ అందర్నీ దాదాపుగా ఖరారు చేసేశారట అనిల్ రావిపూడి. తన కెరీర్‌లోనే గుర్తుండిపోయే హిట్‌గా నిలచిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు పనిచేసిన టెక్నీషియన్సే ఈ మెగా ప్రాజెక్ట్‌కి కూడా పనిచేస్తారని సమాచారం. భీమ్స్ సిసిరోలియో సంగీతం, సమీర్‌రెడ్డి సినిమాటోగ్రఫీ, తిమ్మరాజు ఎడిటింగ్‌తోపాటు డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ కూడా మొత్తం 'సంక్రాంతికి వస్తున్నాం' టీమే ఉంటుందని తెలుస్తున్నది. ఆడియన్స్ మిస్ అవుతున్న చిరంజీవి మార్క్ కామెడీ జానర్‌ను అనిల్ రావిపూడి స్టైల్‌లో ఆవిష్కరించేందుకు కరసత్తులు జరుగుతున్నాయని, 90ల్లో నాటి చిరంజీవి గ్రేస్‌ని ఈ సినిమాలో చూస్తారని చిత్రబృందం చెబుతున్నది. ఇక ఇందులో మెగాస్టార్‌కి జోడీగా నటించే హీరోయిన్, ఇతర పాత్రధారుల వివరాలు మాత్రం తెలియాల్సివుంది. షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్న విషయం తెలిసిందే.



# పిల్లలకు చూపించాల్సిన సినిమా ఇది

'విక్కీ కౌశల్ క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యాను. నిజంగా క్లైమాక్స్‌లో కన్నీళ్లు వచ్చాయి. ఒక చరిత్ర సినిమాగా తీయడం తేలిక కాదు. ఓ కొత్త చరిత్రను ఇంత గొప్ప సినిమాగా ప్రేక్షకుల ముందుకు తెచ్చిన దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్‌గారికి థాంక్స్. ఈ రోజు మనం ఇంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నామంటే కారణం శంభాజీ లాంటి మహారాజులే. పిల్లలకు చూపించాల్సిన సినిమా ఇది' అని నిర్మాత బన్నీ వాసు అన్నారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ఛావా'. విక్కీకౌశల్, అక్షయ్ ఖన్నా, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం తెలుగులో గీతా ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్స్ ద్వారా మార్చి 7న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన థాంక్స్ మీట్‌లో బన్నీవాసు మాట్లాడారు. 'ఛావా'లో కీలక పాత్ర పోషించిన వినీత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ 'ఈ సినిమాను తెలుగులో విడుదల చేసిన గీతాఆర్ట్స్ వారికి థాంక్స్ చెప్పుకుంటున్నా. ఇందులోని నా పాత్రకు వస్తున్న ఆదరణ చాలా ఆనందాన్నిస్తున్నది. నాకు గాత్రదానం చేసిన ఫణివంశీకి కృతజ్ఞతలు' అని తెలిపారు. ఇంకా తెలుగు డైలాగ్ రైటర్ సామ్రాట్, డబ్బింగ్ డైరెక్టర్ రాఘువ, లిరిక్ రైటర్ శ్రీమణి కూడా మాట్లాడారు.

# ప్రేమలోని కొత్త కోణాన్ని చూస్తారు



'మాజీ లవర్‌ను కొందరు శత్రువులా చూస్తుంటారు. కానీ ప్రేమకంటే ముందు వారి మధ్య ఉండేది స్నేహమే. అదే స్నేహాన్ని విడిపోయిన తర్వాత కూడా కొనసాగించవొచ్చు. ఈ పాయింట్‌తో 'దిల్ రూబా' చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు దర్శకుడు విశ్వకరుణ్. దర్శకుడిగా ఆయన తొలిచిత్రమిది. కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు విశ్వకరుణ్ శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'మా స్వస్థలం తాడేపల్లిగూడెం. భీమవరంలో చదువుకున్నా. స్కూల్ రోజుల నుంచే సినిమాలంటే ఆసక్తి. అలాగే సాహిత్యం అంటే మక్కువ. కిరణ్ అబ్బవరంకు ఈ కథ చెప్పగానే వెంటనే అంగీకరించారు. ఇందులో ఆయన సిద్ధు అనే యువకుడి పాత్రలో కనిపిస్తారు. తన తప్పులేనప్పుడు సారీ ఎందుకు చెప్పాలన్నది సిద్ధు స్వభావం. వ్యక్తిత్వం విషయంలో అతను ఎప్పుడూ రాజీ పడడు. తన క్యారెక్టర్‌నే నమ్ముకుంటాడు. ఈ క్రమంలో అతని జీవితంలో తలెత్తే సంఘర్షణే ఈ చిత్ర ఇతివృత్తం' అన్నారు. విడిపోయాక కూడా మాజీ ప్రేయసికి ఫోన్ చేసి ఎలా ఉన్నావని అడగటంలో తప్పులేదని, ఇలాంటి ఎలిమెంట్స్ ఈ సినిమాలో చాలా ఉంటాయని విశ్వకరుణ్ తెలిపారు. తాను పుస్తకాలను బాగా చదువుతానని, చలం, యండమూరి, జంధ్యాల, త్రివిక్రమ్‌ల ప్రభావం తనపై చాలా ఉందని ఆయన చెప్పారు. మనం చూసిన మనుషులు, సందర్భాలే ఏ కథకైనా స్ఫూర్తినిస్తాయని, 'దిల్ రూబా' ప్రేమను సరికొత్త కోణంలో ఆవిష్కరిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తుందని విశ్వకరుణ్ అన్నారు.





